
సుభద్ర ఒక స్కూల్ టీచర్. ఇద్దరు పిల్లలతో ఒంటరిగా బతుకుతోంది. భర్త ఉమాపతి వేరే పెళ్లి చేసుకుని పక్క వూళ్లో కొత్త భార్యతో బతుకుతున్నాడు.

"నాకు నువ్వంటే కోపం లేదు సుబ్బూ. పరిస్థితుల వల్ల ఇంకో పెళ్లి చేసుకున్నానే గాని..." అంటాడు ఉమాపతి.

"నేనేం చేశానని నా మీద నీకు కోపం రావాలి? ఏమీ చెయ్యకపోవడమే నా తప్పు. ఇంక నీ ముఖం చూపించకు. పిల్లలను నేను చాక్కోగలను" అంది సుభద్ర. అన్నదే తడవుగా వెళ్లిపోయాడతను. ఆ తర్వాత రెండు మూడు సార్లొచ్చినా అతన్తో మాట్లాడడానికెవరూ ఇష్టపడక పోవడంతో రావడం మానేశాడు.

సుభద్ర తలచుకొని ఉంటే ఆ ప్రభుత్వోద్యో



# ఆఖరి ఘట్టం

గిని కోర్టు కీడ్చి మూడు చెరువుల నీళ్లు తాగించి ఉండేదే. "నా ఖర్మ ఇలా కాలింది. ఇంక కోర్టుల చుట్టూ తిరగడం ఎందుకు?" అనుకుంది.

ఆ తర్వాత కొన్నాళ్లకే విషయం అందరూ మర్చిపోతున్నారనగా ఎదురింట్లో గోపాలం, అతని ఫ్యామిలీ దిగారు. అతను రిజిస్ట్రాఫీసులో క్లర్కు.

ఒకరోజు సుభద్ర స్కూల్‌కి వెళ్లడానికి సిద్ధమౌతూండగా గోపాలం భార్య కాంతం నీరసంగా వచ్చి "అక్కయ్య గారూ. ఏమీ అనుకో



కండి. ఆరోగ్యం ఈ రోజనంగా బాగాలేదు. కాస్త కూరివ్వండి. పిల్లలకి టైమవుతోంది." అంది.

పరిచయం లేని తనను ఆమె అలా అడగడం సుభద్ర కాశ్చర్యం కలిగించింది. వంకాయ కూరిచ్చి పంపింది.

ఆ తర్వాత ఆమె గ్రహించింది. కాంతానికి ఏదో జబ్బు. ఎన్ని మందులిచ్చినా తగ్గదు. అలా అని ఆమె ఎవర్నీ ఏమీ అడగదు. ఒక్క సుభద్రను తప్ప.

'మీరు చాలా మంచివారు అక్కయ్య గారూ!' అనేది కాంతం.

సుభద్రకి కాంతమంటే జాలి. ఆరోగ్యం బాగాలేక ఆ పిల్లలతో చాలా అవస్థలు పడేది కాంతం. గోపాలం ఆఫీస్‌లో బిజీగా ఉండేవాడు. అతను బాగా డబ్బు సంపాదించడం మొదలెట్టాక అందరూ అతన్ని 'రావు' తగిలించి పిలుస్తున్నారు.

సుభద్ర పిల్లలిద్దరూ గోపాల్రావు పిల్లలు ముగ్గురితోనూ కలిసి ఐదు మందిగా ఆడేవారు. టీ.వీ. చూసేవాళ్లు. ఆదివారం సుభద్ర ఇంట్లో భోంచేసేవాళ్లు.

సుభద్రకి పబ్లిక్ రిలేషన్స్ చాలా తక్కువ. తన పరిస్థితికి పరిచయాలెంత తక్కువగా ఉంటే అంత మంచిదనుకొనేది. అలాంటిది కాంతం

**ఎ. పుష్పాంజలి**

తో తెలియకుండానే దగ్గరైంది.

ఒకరోజు కాంతానికి ప్రాణం మీదికొచ్చింది. హాస్పిటల్లో చేర్చారు. ఎనిమిదింటి వరకూ అక్కడే ఉన్న సుభద్ర "రాత్రయింది పిల్లలు ఎదురు చూస్తుంటారని బయల్దేరింది.

పిల్లలంటే ఆమె పిల్లలే కాదు. కాంతం పిల్లలు కూడా. రాత్రి పన్నెండుకు గోపాల్రావొచ్చి కాలింగ్ బెల్ కొట్టాడు. తలుపు తీసింది సుభద్ర.

అతని ముఖం పీల్చుకుపోయి, బట్టలు నలిగిపోయి, ఎన్నోనాళ్ల లంఖణాలు చేసిన వాడిలా ఉన్నాడు.

"భోంచేశారా?" అడిగింది

అతను మాట్లాడలేదు.

"కాస్త ఎంగిలి పడండి" అంటూ రసం, అన్నం ఉన్న పళ్లెం డైనింగ్ టేబుల్ మీద పెట్టింది.

అతనా పళ్లెం ముందు కూచుని చేతుల్లో ముఖం దాచుకుని గట్టిగా ఏడ్చాడు.

కరిగి నీరైంది సుభద్ర. ఆనాటి నుంచి ఆమె అతని కన్నీరు తుడుస్తూనే ఉంది.

నిజానికి కాంతం సుభద్రతో గోపాల్రావు గురించి మాట్లాడేటప్పుడు "మీ అన్నయ్యగారు"... అనేది.

సుభద్ర కూడా అతన్ని 'అన్నయ్యగారూ' అందామనుకుంది గానీ ఇది వరలో 'అన్నయ్యా' అని పిలిపించుకున్న వాళ్లంతా ఆమెకు ప్రేమ లేఖలు రాసిన వాళ్లే.

ఇప్పుడు ఇతన్ని 'అన్నయ్యా' అనకపోవడం కూడా ఆమెకచ్చిరాలేదు.

వీరిద్దరి విషయం పసిగట్టిన కాంతం అప్పటి నుంచీ "మీ అన్నయ్యగారు" అనడం మానేసింది.



త్యాగరాయగానసభ, హైదరాబాద్‌లో కవి సమయం ఏర్పాటుచేసిన సభలో కడలి సూర్యనారాయణ రచించిన సామాజిక న్యాయం, దర్మపద సుభాషితాలు - గ్రంథాలను ఆవిష్కరిస్తున్న అద్దేపల్లి, కంచె ఐలయ్య. చిత్రంలో తాళ్లపల్లి మురళీధర్‌గౌడ్, నారగోని, ననుమాసస్వామి, ఇనాక్, ఆదినారాయణరాజు, కడలి సూర్యనారాయణ, వెంకటరమణ ఉన్నారు.

ఈ కొత్త బంధంతో చాలామందికి మేలే జరిగింది. కాంతానికి ఆరోగ్యం బాగా లేకపోవ డంతో ఆ బాధ్యతలు సుభద్ర నేర్పుగా నెరవేరు స్తుందని సంతోషపడ్డది. భార్య ఆరోగ్యం బాగా లేకపోవడంతో గోపాలానికే సుఖమూ ఉండేది కాదు. సుభద్ర పరిచయంతో అతని జీవితంలో వసంతం ఉదయించింది.

సుభద్రకీ ఒకతోడు దొరికింది. కష్టసుఖాల్లో పాలు పంచుకునే వ్యక్తి దొరికాడు.

గోపాలం, పిల్లలు ఆమెని 'పెద్దమ్మా' అని సుభద్ర పిల్లలు అతన్ని 'అంకుల్' అనీ కాంతాన్ని 'ఆంటీ' అనీ పిలుస్తున్నారు.

అయితే ఎవ్వరికభ్యంతరం లేకున్నా చుట్టూ సమాజం ఒకటుండనే ఉందిగా. వాళ్లు కాంతం తో అదీ ఇదీ మాట్లాడేవాళ్లు. అప్పుడు కాంతం రాక్షసిలాగా లేచేది. ఆమెకంత శక్తి ఎలా ఒచ్చేదో సుభద్ర కాశ్చర్యంగా ఉండేది. మితి మీరిన శక్తి సామర్థ్యాలతో ఆ చెప్పిన వాళ్లని శాపనార్థాలు పెట్టేది గానీ సుభద్రను పల్లెత్తు మాట కూడా అనేది కాదు.

గోపాలరావు పిల్లలు ఒకర్తె ఆడ, ఇద్దరు మగ. సుభద్ర పిల్లలిద్దరూ ఆడపిల్లలే. సుభద్ర పిల్లలు చాలా చురుకైనవాళ్లు. క్లాస్‌లో ఫస్టే ఎప్పుడూ.

గోపాలరావు పిల్లల్లో, ఆడపిల్ల మరీ మొద్దు. మగపిల్లలు ఫరవాలేదు.

తనచుట్టూ ప్రపంచాన్ని చూస్తే సుభద్రకా శ్చర్యం కలిగేది. ఏమీ తప్పు లేని తననూ, పిల్లల్నీ నిలువునా ఒదిలేసి ఇంకో పెళ్లి చేసుకు పోయిన ఉమాపతి గురించి ఎవ్వరూ ఆట్టే మాట్లాడరు. అతన్ని తప్పు పట్టరు. తన నుంచి ఏదో లాభం ఆశించి వచ్చేవాళ్లు తప్ప. తను ఒంటరిగా జీవిస్తూ పిల్లల్ని చాక్కుంటున్నన్ని నాళ్లూ ఈ ప్రపంచం నుంచి ఎటువంటి ప్రశం సా లేదు. ఇప్పుడు గోపాల్రావుతో తన జీవితం ముడిపడ్డాక అందరూ తననో దోషిగా చూస్తు న్నారు తప్ప గోపాల్రావు గురించి మాట్లాడేవాళ్లే లేరు.

ఒకరోజు ఉమాపతి వచ్చి "నాకు తెలుసే నువ్వు నన్నెందుకు ఒదిలావో, నీకు పెళ్లికాక ముందు నుంచే సంబంధం" అనేసి వెళ్లాడు. అతనన్న మాటకి సుభద్ర అంత బాధపడక పోయినా నరం లేని నాలిక ఎలా తిరుగుతుందా అని ఆశ్చర్యపోయింది.

గోపాల్రావు సుభద్రల బాంధవ్యం ఒక రీతి గా నడుస్తోంది. కాంతానికీ విషయం తెలుసునని వాళ్లిద్దరికీ తెలిసినా ఆమె ముందు చాలా నియ మంగా నడచుకొనేవాళ్లు. కాంతం ఇక సంసార సుఖానికి పనికిరాదని తెలిశాక గోపాల్రావొక గదిలోనూ, కాంతం పిల్లలూ మరొక గదిలోనూ పడుకునేవారు. అతనెప్పుడు ఎక్కడికి వెళ్తున్నా డో, వస్తున్నాడో కాంతానికి తెలిసేదే కాదు.

కాంతం ముందు పాటించిన నియమావళి తన పిల్లల ముందూ తప్పనిసరిగా పాటించేది సుభద్ర. ఆ పిల్లలు ససేమిరా నమ్మరు. ఆ కార ణంచేత కూడా గోపాల్రావు రాకపోకలు ఒక నిబంధన ప్రకారం జరిగేవి.

కాలం గడిచే కొద్దీ గోపాల్రావు పిల్లలు కాల క్రమేణా సుభద్రకి బాగా చేరువైనారు. వాళ్లల్లో ఎవరికారోగ్యం బాగాలేకున్నా సుభద్ర మనస్సు కొట్టుకలాడేది. కానీ సుభద్ర పిల్లలు మాత్రం గోపాల్రావుకి చేరువకాలేకపోయారు. కాంతం ప్రవర్తన అందరి పట్లా ఒకేలాగున ఉండేది.

సుభద్రకు అంతగా బంధువుల్లేరు. తల్లీ, తండ్రీ గతించారు. ఒక అన్నయ్య దూరపు ఊళ్లో ఉండేవాడు. అతని భార్య అంత కలుపుగోలు

మనిషికాదు. ఆవిడకు బంధువులంటే గిట్టేది కాదు. అన్నమాత్రం అపుడపుడూ వచ్చి వెళ్లే వాడు. అతనొకసారి హఠాత్తుగా "అమ్మాయ్! నువ్వొక్కదానివే పిల్లల్ని పెట్టుకుని ఇంత దూరం గా ఎందుకమ్మా. ట్రాన్స్‌ఫర్ చేయిస్తా... మాకు దగ్గరగా వచ్చేయ్" అన్నాడు. ఈ మాట సుభద్ర మీద ఎటువంటి ప్రభావమూ చూపలేదు.

రిజిస్ట్రాఫీసులో అదనపు సంపాదనకు మరిగిన గోపాల్రావు బాగా డబ్బు సంపాదిం చాడు. ఒక చిన్న ఉద్యోగిగా ఆ వూళ్లో అడుగె ట్టిన అతను ప్రస్తుతం తనుంటున్న ఇల్లు కొ న్నాడు. సుభద్రదీ సొంతిల్లే. అది అట్టే పెద్దది కాదు. ఆమె పెళ్లప్పుడు ఆమె తండ్రి ఆమె పేరుతో పెట్టాడు.

గోపాల్రావుతో పరిచయమయినప్పుడు సుభద్ర ఎవరు ఏది మాట్లాడుకున్నా తనని గురించేననుకునేది. రాను రాను నిజంగా తనని గురించే మాట్లాడుకుంటున్నా లెక్క చేయడం మానేసింది.

ఇదంతా ఎన్నాళ్ల నాటిమాట? ఇప్పుడు సుభద్ర కూతుళ్లు ఒకరు ఇంజనీరింగూ, మరొ కరు మెడిసినూ చదువుతున్నారు. వాళ్ల చదు వుల కోసం ఆమె ఏ మాత్రం కష్టపడలేదు. అంతా మెరిట్ స్కాలర్‌షిప్పుల మీదనే చదువు తున్నారు. మిగతాది ఆమె కూడబెట్టినదే. రెండు మూడు సందర్భాల్లో గోపాల్రావు ఫీజులకీ పుస్త కాలకనీ చెప్పుకోదగ్గ మొత్తాలే ఇచ్చాడు.

గోపాల్రావు కూతురు టెన్త్ ఫెయిలయి తానింక చదవలేననీ, పుస్తకం పట్టుకుంటే తనకి పిచ్చి పట్టినట్టుంటుందనీ చెప్పి మానేసింది. కొడుకులు ఒకడు బియ్యే, మరొకడు బికాం, అత్తెసరు మార్కులతో పాసైనారు. ప్రస్తుతం ఒక రు ఎలక్ట్రికల్ షాపూ, మరొకరు డిపార్ట్‌మెంటల్ స్టోరూ పెట్టుకుని ఉన్నారు.

కాంతానికి సుభద్ర కూతుళ్లంటే చాలా అడ్మి రేషన్. "చదువుల సరస్వతులిద్దర్ని కన్నా వక్క య్యా" అంటుండేది. అస్తమానం వాళ్లతో పోల్చి తన కూతుర్ని తిట్టి పోసేది. అంతేకాదు. "మీ నాన్న లంచాలు పుచ్చుకోవడం వల్లే మీకు చదు వబ్బ లేదురా" అని కూడా అనేది. ఈ ప్రపంచం లో సుభద్రకి 'ఫలానా విధం' అని అర్థం కాని వ్యక్తి ఒక్క కాంతం మాత్రమే.

మెడిసిన్ చదివే అమ్మాయికి ముందుగా చదువైపోయింది. ఎంట్రెన్స్ రాసి పీడియాట్రిక్స్ లో సీటు సంపాదించి స్పెషలైజేషన్ చేస్తోంది. రెండోపిల్ల కాంపస్ సెలక్షన్స్‌లో ఒక ఎమ్.ఎన్. సి. కంపెనీలో ఉద్యోగం సంపాదించింది. ఆమె కు యు.ఎస్. వెళ్లి ఎమ్.ఎస్. చేయాలని ఉన్నా తల్లిని ఇబ్బంది పెట్టడమెందుకని మానేసింది.

ఈ మధ్య గోపాల్రావు ప్రవర్తన మారినట్టని పించింది సుభద్రకి. మాటిమాటికీ "ఆడపిల్లకి పెళ్లి చేయడమెట్లా" అనేవాడు. "ఏం డబ్బు లేదా?" అనేది సుభద్ర. "అదికాదు. డబ్బుంటే సరా..." అని ఆపేసేవాడు. తన మనసులో మాట చెప్పేవాడు కాదు.

ఇదిలా ఉండగా సుభద్ర పెద్ద కూతురు తన క్లాస్‌మేట్‌తో క్లోజ్‌గా ఉండసాగింది. కొన్నా ళ్లకి అతని పేరెంట్స్ సుభద్రని చూడడాని కొచ్చారు. వాళ్లిద్దరూ హైద్రాబాద్‌లో డాక్టర్లు. కులం కూడా వేరే. "మీ అమ్మాయి మాకు నచ్చింది. మా అబ్బాయి మీకు నచ్చితే పెళ్లి చేద్దాం. హాస్పిటల్ వాళ్లే చూసుకుంటారు" అన్నారు వాళ్లు. వాళ్లకి పెద్ద హాస్పిటలుంది. దాన్ని చూసుకోవడానికి తగిన కోడలు కోసం వెదుకుతున్నారు.

"వీళ్లతో సంబంధం కుదుర్చుకోడానికి తనే విధంగానూ తగదు" అనుకుంది సుభద్ర. ఆమె కళ్లు నీళ్లతో నిండాయి.

హైద్రాబాద్‌లోనే పెళ్లి జరిగింది. ఆ కార్లూ, మేడలూ, నగలూ వైభోగం చూసి సుభద్రకే కాక ఫ్యామిలీ ఫ్రెండ్స్ రూపంలో వచ్చిన గోపాల్రావు దంపతులకు, పిల్లలకూ కళ్లు తిరిగిపోయాయి. సుభద్ర వదిన హఠాత్తుగా సుభద్ర మీద ప్రేమ కురిపించడం మొదలెట్టింది.

తిరిగొచ్చాక గోపాల్రావు "నీకు మంచల్లుడొచ్చాడు నాకెలాంటి వాడొస్తాడో" అని చాలా సార్లు దిగులుగా అన్నాడు.

అతను దిగులుపడ్డట్టే ఒక "దగుల్బాజీ సంబంధం" (కాంతం భాషలో) వచ్చింది. వరుడు ఇప్పుడే నిద్రలేచి వచ్చినట్టున్న ముఖం కలవాడు. అతని తల్లిదండ్రులు ప్రతిచోటా తమ సంస్కారం ప్రదర్శించారు.

సుభద్రని ఎగాదిగా చూస్తూ "మీరెవరు? బంధువులా? పెళ్లి కూతురికేమవుతారు?" అన్నారు. కాంతానికి వళ్లు మండి "డబ్బుకు గడ్డి తినే వెధవకి వివరాలెందుకో" అన్నది చాటుగా. "తనక్కడికి రాకుంటే బాగుణ్ణు" అనిపించింది సుభద్రకి.

చివరికా సంబంధమే కుదిరిందా పిల్లకి. "పెళ్లి కొడుకు లక్షణంగా వ్యాపారం చేసుకుంటున్నాడు. పిల్లా పిల్లోడు హాయిగా ఉంటారు" అన్నాడు గోపాల్రావు. కాంతం మాత్రం "ఏదో చిన్నా చితకో గవర్నమెంటు ఉద్యోగస్తుడైతే బాగుండేది" అంది. సుభద్రకి ఈ పెళ్లి ఇష్టం లేదు. కానీ ఆమె అభిప్రాయం ఎవ్వరూ అడగలేదు.

సుభద్ర చిన్న కూతురికి బాంబేలో పోస్టింగ్ వచ్చింది. సుభద్ర కూతురితో కలిసి బాంబే వెళ్లింది. అక్కడ కంపెనీవాళ్లే ఆమెకు అకామడేషన్ చూపించారు. అంతా బాగుందని నమ్మకం కుదిరాక తిరిగి వూరొచ్చింది. సుభద్ర.

"అమ్మా! ఆ ఇల్లమ్మేసి నువ్వూ వచ్చేసెయమ్మా" అంది కూతురు.

'ఏంటీ? ఆ ఇల్లమ్మడమా' అనుకుంది మనసులో. అనేక సంవత్సరాలు తనక్కడ కష్ట సుఖాలనుభవించింది. పైగా ఇప్పుడు గోపాల్రావుతో కూడా తనకొక బంధం ఏర్పడింది.

గోపాల్రావు కూతురి పెళ్లి పనులు మొదలెట్టాడు. పిల్లకి నగలూ చీరలూ వగైరాలు కొంటున్నారు. తనని పిలవకపోవడం వింతగా తోచింది సుభద్రకి. "అయినా తను ఊళ్లో లేనందువల్ల ఆ పనులైపోయుంటాయి. అందుకే తన 'సలహా, సహాయం అవసరం రాలేదు' అనుకొంది.

కాంతం చాలా విచారంగా కనిపించింది. పెళ్లింక నెల రోజులుందనగా గోపాల్రావు అసలు కనపడలేదు. ఇల్లంతా చుట్టాలతో నిండిపోయింది. చివరికి ముహూర్తం రోజు సుభద్రని పిలవకుండానే, ఆమెకి తెలియకుండానే నాలుగు కార్లు తిరుమల వెళ్లిపోయాయి. అక్కడే పెళ్లి.

ఆమెకంతా అర్థమైంది.

పది హేన్రోజుల తర్వాత గోపాల్రావొచ్చాడు.

"వాళ్లు చాలా లోక్లాస్ మనుషులు. నిన్నూ నన్నూ గురించి కథలు కథలుగా మాట్లాడుకుంటున్నారు. మరి... జరిగిందానికి నువ్వేమీ అనుకోవుగా" అన్నాడు.

"ఏమీ అనుకోను" దృఢంగా అంది సుభద్ర

ఆ తర్వాత వారం రోజులకి నలుగురు పెద్దమనుషులు సుభద్ర ఇంట్లో నుంచి వెళుతుండగా చూసి గబగబా వచ్చాడు గోపాల్రావు.

"ఎవరువాళ్లు?" అన్నాడు.

"ఈ ఇల్లు కొనడానికి చూట్టానికొచ్చారు" అంది సుభద్ర. ●